
# చరిత్ర విస్మరించిన వైతాళికుడు

వార్త 05-09-2003



రెవ॥ పురుషోత్తమ చౌదరి

ప్రాధాన్యతలు తెలియని సమాజాలకు చరిత్ర కూడా సహాయం చేయలేదు. రెవ.పురుషోత్తమ చౌదరి వంటి వైతాళికుడు, వాగ్గేయకారుడు, సత్యాన్వేషి, దార్శనికుడు, సత్యశీలి, భారతీయ క్రైస్తవ సమాజానికి ప్రత్యేకించి ఆంధ్ర క్రైస్తవ సమాజానికి ఏమీ కాని వాడు అయ్యాడు. 1830-1890ల మధ్య తెలుగు క్రైస్తవ వాఙ్మయానికి సంపద్వంతమైన సాహిత్యాన్ని సంగీతంతో సమ్మిళితం చేసి అందించిన అమరుడాయన. అటువంటి మహనీయుని ద్విశత జయంతి అనామకంగా జరిగిపోతున్నది.

కింగ్ జార్జి-3 ఇంగ్లాండును పరిపాలిస్తున్న కాలంలో 1803 సెప్టెంబర్ 5వ తేదీన జన్మించిన పురుషోత్తమ చౌదరి- 1832 జూన్ 20న విక్టోరియా మహారాణి సింహాసనం అధిష్టించేనాటికి సుదీర్ఘ సత్యాన్వేషణ ప్రస్థానాన్ని ముగించిన వేదాంతి. తండ్రి కూర్మనాధ చౌదరి, తల్లి సుభద్రాదేవి. 1798నుండి రాజా జగపతిదేవ్ పర్లాకిమిడి జమీందారుగా ఉండేవారు. పురుషోత్తమ చౌదరి తాతలనాటినుండి ఆ ఆస్థానంలో ఆస్థాన కవులుగా ఉండేవారు. పురుషోత్తమ చౌదరికి 20ఏళ్ల వయసులో మేనమామ రఘునాథ్ పార్ మహంతి కుమార్తె రాధా మణిదేవితో వివాహం జరిగింది. వైష్ణవోపాసకుడైన పురుషోత్తమ చౌదరి భక్తి క్రమంగా వేదాంతంవైపు మరలింది. హైందవమత ఛాందస ఆచారాలు, భక్తి క్రియలు వృధాఅని భావించారు. సన్యాసాశ్రమంలోనే బ్రహ్మజ్ఞాని కావలెననే వాంఛ ఆయనలో పెరిగింది. ఈక్రమంలో యవ్వనంలోనే వేదాంతి అయ్యారు. ఒక చిన్న కరపత్రం ద్వారా యేసుక్రీస్తు గురించి తెలుసుకున్నారు. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో చివరికి రెవరెండ్ పురుషోత్తమ చౌదరిగా ఆంధ్ర క్రైస్తవ సమాజానికి అమూల్యమైన సాహితీ సంపత్తిని సమకూర్చారు. ఎంతోమంది మత విశ్వాసాలు మార్చుకోవడం మనకు తెలుసు. కాని పురుషోత్తమ చౌదరి విషయంలో కొన్ని విశేషాలు ఉన్నాయి. అవి: ఒకటి- ఆయన సత్యాన్వేషణ కాలం, రెండు- ఇంటిలో ప్రతికూల పరిస్థితులు, మూడు- బయట కొత్త మతంలో అరకొర సహకారం, అస్పష్టత, భాషా సమస్య, నాలుగు- సమాజంనుండి భౌతిక హింస, ప్రతిఘటన, ఐదు- స్వచ్ఛందంగా తనముందుకొచ్చిన ఉన్నత ఉద్యోగాల ప్రతిపాదనల్ని తిరస్కరించడం, ఆరు- ఆంధ్రదేశ ప్రధాన పట్టణాలలో సువార్తను బోధించడం, ఏడు- శుద్ధ శాస్త్రీయమైన రాగాలలో 130 కీర్తనలను ఆంధ్ర క్రైస్తవ వాఙ్మయానికి అందించడం. అనితర సాధ్యమైన అంశాలివి. ఒక్క రాజా రామమోహన్ రాయ్ తప్ప మరే ఇతర సాంఘిక సంస్కర్తలుగాని, లేదా సాంఘిక ఉద్యమాలుగాని ఇంకా రూపుదిద్దుకోని కాలమిది. ఆ కాలంలోనే హైందవ మతంలోని సనాతన ఆచారాల్ని, చాతుర్వర్ణ వ్యవస్థని విస్మరించి ఇల్లు దాటి బయటకొచ్చి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన పురోగామి ఆయన. మత విశ్వాసాలు వాటి హెచ్చుతగ్గుల మీమాంస వ్యక్తిగతమే అయినా ఆ కాలంలో 'మార్పు' కోసం ఒకనిర్ణయం తీసుకోవడం కూడా విప్లవాత్మకమే. పురుషోత్తమచౌదరి 1890లో కన్ను మూశారు.

**★ ఒక మహనీయుని ద్విశత జయంతి అనామకంగా జరిగిపోతున్నది**

కోరమాండల్‌తీరంలో సువార్త, క్రైస్తవ సంఘాల స్థాపన మొదలైన మత వ్యాప్తి వ్యవహారాలు నత్తనడక నడుస్తుండేవి. కటక్‌నుండి చెన్నపురి (చెన్నై) వరకు క్రైస్తవ సువార్త కార్యకలాపాలు ఇంకా మొదలుకాని రోజులవి. 1800సం. విలియం కేరి సిరంపురంలో బైబిల్‌లోని కొన్నిభాగాలు అనువాదం చేసే ప్రయత్నం ప్రారంభించారు. బైబిల్ కొత్త నిబంధనలోని మత్తయి, మార్కు, లూకా సువార్తలు తెలుగులోకి అనువాదమయ్యాక 1829లో చెన్నపురిలో వాటిని అచ్చువేయించారు. అప్పట్లో శ్రీకాకుళంలో 41వ బెటాలియన్ క్యాంపు చేసి ఉండేది. దానిలోని దొరలు కొందరు సువార్త ప్రకటించేవారు. ఈ నేపథ్యంలో 1825లో పురుషోత్తమచౌదరి అన్న జగన్నాధచౌదరి 'క్రీస్తు మత గురువులు ఈ సీమ సమస్త జనులకు రాసిన పత్రిక' అనే శీర్షికతో ఉన్న ఒక కరపత్రాన్ని తెచ్చి పురుషోత్తమ చౌదరికి ఇచ్చారు. ఆ కరపత్రంలోని విషయం బోధపడకపోవడంతో దాన్ని ఆయన పెట్టెలో పడవేశారు. కొంతకాలానికి ఇంజనీర్ లెఫ్టినెంట్ హిల్‌ని చూసిన పురుషోత్తమ చౌదరికి మొదటిసారి ఒక ప్రత్యేకమైన అనుభూతి కలిగింది. వెంటనే ఏడేళ్ల క్రితం పెట్టెలో పడవేసిన కరపత్రం బయటకుతీసి చదివి ఆలోచనలో పడ్డారు. ఆశ్రమ జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నప్పటికీ క్రీస్తు మత సిద్ధాంతాలను పరిశోధించిన మీదట ఏది ఉత్తమమో గ్రహించాలనుకున్నారు.

బరంపురంలో మిషనరీలు ఉన్నారని తెలిసి వారికి ఉత్తరం రాసి కూలివానికిచ్చి పంపారు. దానికి వచ్చిన జవాబు విసుగు కలిగించింది. 1832లో విశాఖపట్నం వెళ్లి అక్కడ క్రైస్తవ మతం గురించి విచారిస్తే ఎవరో రోమన్ క్యాథలిక్ దేవాలయం చూపించారు. ఆయన అక్కడి విగ్రహాలు చూసి నిరుత్సాహపడి వెళ్లిపోయారు. అప్పుడు చెన్నపట్టణంలో తప్ప మరెక్కడా ప్రొటెస్టెంట్ మిషనరీలు లేరు. అక్కడికి వెళ్లడానికే ఆయన నిశ్చయించుకున్నారు. శ్రీకాకుళంలో కోర్టుపని ఉందని అన్న చెబితే, పని పూర్తి అయ్యాక చెన్నపట్నం వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. కట్టుపంచెలో దాచిన రూపాయితో ప్రయాణం. ఇంతలో శ్రీకాకుళంలోనే నాగావళి తీరంలోఉన్న బెటాలియన్లో కెప్టెన్ నాట్ భార్య హెలెన్‌నాట్ ఆంధ్ర బాలికా పాఠశాలలు నడుపుతున్నారని, ఆమె క్రైస్తవ కరపత్రాలు పంచుతారని విని పురుషోత్తమ చౌదరి ఆమెను కలుసుకుని తన పరిస్థితి వివరించారు. ఆమె ఆయన్నిఆదరించారు. బెటాలియన్‌లోని అధికార్లకు పరిచయం చేశారు. వారు ఆయన్ని చెన్నపట్నం ఓడమీద పంపడానికి యోచించి- మీ నిర్ణయం గురించి మీఇంటిలో వారి అనుమతి తీసుకు- రమ్మని చెప్పారు. పురుషోత్తమ చౌదరి నిర్ణయం తెలుసుకొని ఇంటిల్లిపాదీ దుఃఖాక్రాంతులయ్యారు. ఆయన బంధువర్గాన్ని, యజ్ఞోపవీతాన్నికూడా త్యజించి 1833 అక్టోబర్ 6న కటకపురి (కటక్)లో బాప్టిజంద్వారా క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. విశాఖపట్నంలో మిషనరీగా జీవితాన్ని ప్రారంభించిన పురుషోత్తమ చౌదరికి నెలవారీ వేతనం ఏర్పాటు చేయమని చార్లెస్ లేనేదొర చెన్నపురికి లేఖ రాయాలనుకున్నారు. అందుకు చౌదరి అభ్యంతరం చెప్పారు. నేను ఏకాకిని. నాకు అన్నపానాలు లభించినచాలు, వేతనమెందుకు? అని ప్రశ్నించారు. బహిరంగ ప్రదేశాలలో నాలుగు రోడ్ల కూడళ్లలో చౌదరి సువార్త ప్రచారం చేస్తుండేవారు. కరపత్రాలు పంచి పెట్టేవారు. అక్కణ్ణించి చౌదరి బళ్లారి వెళ్లారు. దాదాపు 1300 మైళ్ల ప్రయాణంలో వేలాదిమందికి ఉత్కళ, ఆంధ్ర భాషల్లో సువార్త ప్రకటించారు. బళ్లారి నుండి గుంతకల్లు, అనంతపురం, మదనపల్లి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, మంగళగిరి, బెజవాడ, ఉయ్యూరు, బందరు వరకు మార్గమధ్యంలోఉన్న పట్టణాలలో సువార్త ప్రకటిస్తూ కరపత్రాలు పంచుతూ అక్కడక్కడ పరాభవాలు పొందుతూ దీర్ఘ ప్రయాణం సాగించారు. మంగళగిరిలో ఒక బ్రాహ్మణ కుటుంబం ఆయనకు ఆతిథ్యమిచ్చి విందు ఏర్పాటు చేసింది. తిరుగు ప్రయాణంలో ఏలూరు, భద్రాచలం, రాజమహేంద్రవరం, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం పట్టణాలమీదుగా విశాఖ పట్నం చేరుకున్నారు. ఈ విధంగా 18నెలల్లో 3000 మైళ్ల సువార్త ప్రచారం చేశారు.

**★ ఆయన ద్విశత జయంతి సందర్భంగా అయినా ఆంధ్ర క్రైస్తవ సమాజం సముచితంగా గౌరవించాలి.**

అప్పట్లో శ్రీకాకుళంలో సివిల్ సెషన్సు జడ్జి పురుషోత్తమ చౌదరి గురించి విని ఈస్టిండియా కంపెనీ కొలువుకు వస్తే శిరస్తార్ ఉద్యోగమిచ్చి మంచి జీతం ఏర్పాటు చేస్తామని అడిగారట. అందుకాయన క్రీస్తు శుభవర్తమానం ప్రచారం తప్ప మరే ఏ ఇతర వ్యాపకాలపైన ఇష్టంలేదని చెప్పారు. 1838 ఏప్రిల్ 1న బరంపురంలో ఎనిమిదిమంది సభ్యులతో పురుషోత్తమ చౌదరి పాస్టర్‌గా బాప్టిస్టు చర్చి ప్రారంభించారు. ఎన్నో అద్భుతమైన కీర్తనలను శుద్ధ శాస్త్రీయ రాగాలతో రాశారు. ఉత్తరాంధ్ర, సర్కారు జిల్లాల్లో పలు గ్రామాల్లో మొఖాసాదార్లు పెద్దలు పురుషోత్తమ చౌదరి పిలుపు అందుకుని క్రైస్తవ మతం స్వీకరించారు. 1888లో అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు ప్రచురించాలని సంకల్పించి మిషన్ తరపున రెవ. స్టీవెన్స్ పురుషోత్తమ చౌదరి రాసిన కీర్తనల వివరాలుకోరారు. అప్పుడు 80 కీర్తనలు ఆయనే స్వయంగా ఇస్తూ- తన కీర్తనలలో మార్పులు చేయవద్దని కోరారట. ఆయన రాసిన మొత్తం కీర్తనలు 130, పద్యాలు దాదాపు 200. కుమార్తెలు, కుమారులతో పురుషోత్తమ చౌదరి సంపూర్ణ జీవితాన్ని గడిపారు.

పురుషోత్తమ చౌదరి ఎవరు, ఆయన ఆంధ్ర క్రైస్తవ సమాజానికి ఏమి చేశారువంటి విషయాలు నేటి క్రైస్తవ సమాజానికే పట్టని విషయాలు. ఇక క్రైస్తవేతర సమాజానికి ఆయన తెలిసి ఉండాలనుకోవడం అత్యాశ అవుతుంది.

కారణాలు ఏమైనా ఆయనకు ప్రధాన చరిత్రలో చోటు దొరకలేదు. ఒకవేళ ఆయన్ని కేవలం క్రైస్తవ ప్రచారకుడు లేదా ఒక సాదాసీదా పాస్టర్ అనుకున్నప్పటికీ, ఆయన అందించిన సాహిత్యం, సంగీతం, కులీన భారతీయ హైందవ సమాజంలో క్రైస్తవ మతానికి ఆయన కల్పించిన స్థానం- వీటన్నిటినీ పరిగణించినా కనీసం ఆంధ్ర క్రైస్తవ సమాజానికైనా ఆయన వైతాళికుడు అవుతాడు. కానీ కాలేదు! కనీసం ఆయన ద్విశత జయంతి ఏడాది అయినా ఆంధ్ర క్రైస్తవ సమాజం ఆయన్ని సముచితంగా గౌరవించాలి. ఇక ప్రధాన స్రవంతి ఆయన్ని గౌరవించడం అంటే అది తనను తాను గౌరవించుకోవడమే అవుతుంది!

■ జాన్సన్ చోరగుడి

రెవ॥ పురుషోత్తమ చౌదరి ద్విశతజయంతి సందర్భంగా